సాక్షి అనకాపల్లి
గురువారం । 24 । జూలై । 2025



భూముల జోలికి రావొద్దు

తక్షణం భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట 7 గ్రామాల రైతులు నిరసన తెలిపారు. 8లో



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు.



కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా విశాఖ శ్రీలలితా పీఠంలో బుధవారం కాళీ కాళభైరవులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపు కోనాం జలాశయం సాగునీరు విడుదల

చీడికాడ: ఖరీఫ్ సాగునీటి అవసరాల కోసం శుక్రజువారం కోనాం జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు జలాశయం చైర్మన్ పోతల చిన్నంనాయుడు బుధవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరై ఉదయం 10 గంటలకు సాగునీటిని హైలెవెల్ స్లూయిస్ ద్వారా విడుదల చేస్తారని ఆయన తెలిపారు. జలాశయం పరిధిలో గల నీటి సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని జలాశయం ఇన్‌చార్జి జేఈ సత్యనారాయణదొర పేర్కొన్నారు.

రైతులకు ఎన్‌పీసీఐ, మ్యాపింగ్ తప్పనిసరి

తుమ్మపాల: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి ఎన్‌పీసీఐ ఇన్-యాక్టివ్, మ్యాపింగ్ కాని ఖాతాల వివరాలను రైతు సేవా కేంద్రాల లాగిన్‌లో పొందుపరిచామని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాల్లో వారి వివరాలు తెలుసుకోవాలని, ఎన్‌పీసీఐ ఇన్-యాక్టివ్, మ్యాపింగ్ కానీ రైతులు తమ బ్యాంకు అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలన్నారు. భూమి ఆధార్ మ్యాపింగ్ తప్పుగా నమోదైనవి, మ్యుటేషన్ పూర్తికానివి, ఒకే భూమి విస్తీర్ణం ఎక్కువమంది రైతులకు రీ-సర్వేలో ఉన్నవి, ఆధార్ మ్యాపింగ్ కాని వాటి రికార్డులను రైతులు రెవెన్యూ కార్యాలయంలో సరిచేసుకోవాలని కోరారు.

రైల్వే ఈక్యూ బెర్త్‌ల కేటాయింపు వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: అత్యవసరంగా ప్రయాణించే వారి ప్రత్యేక కోటా(ఈక్యూ) బెర్త్‌లకు సంబంధించిన వేళలు మారాయి. అర్ధరాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు ప్రయాణించే రైళ్లకు సంబంధించిన అత్యవసర కోటా బెర్త్‌ల అభ్యర్థనలను ముందురోజు మధ్యాహ్నం 12 గంటలకు కేటాయిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రయాణించే రైళ్లకు సంబంధించిన అత్యవసర కోటా బెర్త్‌ల అభ్యర్థనలను ముందురోజు సాయంత్రం 4 గంటల లోపు అందజేయాలి. ప్రయాణికులు ఈ కొత్త వేళలను గమనించి, తదనుగుణంగా తమ ఈక్యూ అభ్యర్థనలను సమర్పించాలని అధికారులు కోరారు.

గవర విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

అనకాపల్లి: జిల్లాలో గవర సామాజిక పేద విద్యార్థులకు ఈ ఏడాది పదో తరగతి నుంచి ఉన్నత చదువుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేయనున్నామని గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీలోగా స్థానిక గవరపాలెం గౌరీ సేవా సంఘంలో అందజేయాలని పేర్కొన్నారు. 2025-26లో పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ, ఈసెట్, ఇంజినీరింగ్, మెడిసిన్, బీడీఎస్, ఐఐటీ, నెట్, తదితర కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను సంఘం కార్యాలయంలో ఈ నెల 25 నుంచి పంపిణీ చేస్తామన్నారు. గతంలో స్కాలర్‌షిప్స్ అందుకున్న విద్యార్థులు రెన్యూవల్ కోసం సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 92914 45574లో సంప్రదించాలని వారు కోరారు.

గ్రావెల్ మాఫియా విశ్వరూపం

- అచ్యుతాపురం సెజ్ ప్రాంతం నుంచి భారీ ఎత్తున తరలింపు
- చోద్యం చూస్తున్న ఏపీఐఐసీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు
- మామూళ్లు ఇస్తున్నాం.. తమను ఎవరూ అడ్డుకోలేరని కూటమి నేతల బహిరంగ వ్యాఖ్యలు

మడుతూరులో పొక్లెయిన్ల సహాయంతో గ్రావెల్ తవ్వకాలు



సాక్షి, అనకాపల్లి/అచ్యుతాపురం రూరల్:

గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. అనుమతుల్లేకుండా ప్రభుత్వ ఆస్తులను గ్రావెల్ అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. అచ్యుతాపురం సెజ్ ప్రాంతంలో గల మట్టిని అక్రమంగా దోచుకుంటున్నారు. కూటమి నేతల అండదండలతో రాత్రి పగలు అన్న తేడా లేకుండా ఇష్టానుసారంగా గ్రావెల్, చెరువు మట్టిని తవ్వేస్తున్నారు. పొక్లెయిన్ల సహాయంతో యథేచ్ఛగా కొండలను సైతం పిండి చేస్తున్నారు. అచ్యుతాపురం సెజ్ పరిశ్రమలను ఆనుకుని ఉన్న గల మడుతూరు, ఇరువాడ, యర్రవరం, ఉప్పవరం, జగన్నాథపురం, నడింపల్లి గ్రామాల్లో ఉన్న చెరువులు, కొండల్లో గ్రావెల్, చెరువుమట్టిని మాయం చేస్తున్నారు. అనుమతుల్లేకుండా ఈ ప్రాంతాల నుంచి పొక్లెయిన్లతో తవ్వి గ్రావెల్, చెరువు మట్టిని కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తరలిస్తున్నారు. అధికారులకు ముడుపులు చెల్లించి యథేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నారు.

ఏపీఐఐసీ అధికారులకు రోజువారీ మామూళ్లు రూ. 50 వేలు ఇస్తున్నామని... తమను ఎవ్వరూ ఆపలేరంటూ బహిరంగంగానే కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. వీరి వ్యాఖ్యలకు తగ్గట్టు ఏపీఐఐసీ అధికారులు కూడా గ్రావెల్ అక్రమ రవాణాను పట్టించుకోకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. బుధవారం కూడా అచ్యుతాపురం మండలంలో ఏపీఐఐసీ భూముల్లో ఉన్న మడుతూరు కొండ, ఇండస్ట్రియల్ చెరువుతో పాటు పలుచోట్ల నుంచి పెద్ద ఎత్తున గ్రావెల్ తరలించారు.

నెలకు రూ.6 కోట్ల విలువైన గ్రావెల్ దోపిడీ

అచ్యుతాపురం సెజ్‌లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు గ్రావెల్ అవసరం ఉంది. ఏపీఐఐసీ భూముల్లో ఉండే ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టి మరీ గ్రావెల్ మాఫియా దోచుకుంటోంది. రోజుకు సుమారుగా 200 లోడ్‌ల గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. పదుల సంఖ్యలో 12 టైర్ల లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. అంటే ఒక్కో లారీ రోజుకు 70 నుంచి 80 టన్నుల చొప్పున 200 ట్రిప్‌ల గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఒక్కో లారీ లోడ్‌ను రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు అమ్ముకుంటున్నారు. అంటే రోజుకు రూ. 20 లక్షల విలువైన గ్రావెల్‌ను మాయం చేస్తున్నారు. అంటే నెలకు ఏకంగా రూ.6 కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమార్కులు దోచుకుంటున్నారు. వాస్తవానికి ఇక్కడ పరిశ్రమలకు స్థానికంగా తమ భూముల్లో నిర్మాణాలతో పాటు ఫిల్లింగ్‌కు గ్రావెల్ అవసరం ఎక్కువగా ఉంటోంది. ఈ అవసరాన్ని ఇప్పుడు కూటమి నేతలు జేబులు నింపుకునేందుకు వాడుకుంటున్నారు. **తాము సరఫరా చేస్తేనే తీసుకోవాలనే నిబంధనతో ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ రవాణాను సాగిస్తున్నారు. ఇందులో అధికారులకూ** వాటాలు అందుతుండటంతో వారు కనీసం ఫిర్యాదు కూడా చేయడం లేదనే విమర్శలున్నాయి.

ఏపీఐఐసీ అధికారులకు ముడుపులు...!

ఎటువంటి అనుమతులు లేకుండా.. అడ్డు అదుపు లేకుండా కొండలను పిండి చేసి మరి అక్రమ గ్రావెల్‌ను దోచుకుంటున్నా ఇటు ఏపీఐఐసీ అధికారులు.. అటు రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు. ఇటు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కలుషితం చేస్తున్నారు. ఏపీఐఐసీ అధికారులకు రోజుకు వేలల్లో ముడుపులు చెల్లించి గ్రావెల్‌ను దోచుకుంటున్నట్లు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో అనుమతుల్లేకుండా ఎక్కడ పడితే అక్కడ రాత్రింబవళ్లు తేడా లేకుండా యథేచ్ఛగా అక్రమార్కులు కొండలను, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టి కుబేరులైపోతున్నారు. ఎవరైనా స్థానికులు అడ్డగిస్తే వారిపై దురుసుగా వ్యవహరిస్తూ అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇక స్థానికులెవరైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. నేరుగా వారికే సమాచారం ఇచ్చి నామమాత్రంగా తనిఖీలు చేయడానికి వస్తున్నారు. పట్టపగలే గ్రావెల్ కొండలను పిండి చేస్తున్నా చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు.



అచ్యుతాపురం సెజ్ పరిసర ప్రాంతాల్లో గ్రావెల్‌ను చదును చేస్తున్న దృశ్యం

'ఆడబిడ్డ నిధి' ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర



వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ

దేవరాపల్లి: ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎగ్గొట్టి మహిళలను మోసగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ విమర్శించారు. తారువలో బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 'ఆడ బిడ్డ నిధి పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మాలి' అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు అధికార దాహంతో హామీలిచ్చి గద్దెనెక్కాక నమ్మి ఓట్లేసిన మహిళను నిలువునా మోసగించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. మంత్రి మాటలతో మహిళల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. కూటమి నాయకులు ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల పేరిట మేనిఫెస్టోను ప్రకటించి, బాండ్లు సైతం రాసిచ్చి అమలు చేయకుండా ఎగ్గొట్టడం సరికాదన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీనీ కరోనా విపత్కర పరిస్థితుల్లో సైతం అమలు చేశారని ఆమె గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో జగన్ అప్పులు చేస్తున్నారని చంద్రబాబు సహా కూటమి నాయకులు దుష్ప్రచారం చేశారని, నాడు జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల రూపంలో ప్రజలకు మేలు చేశారని గుర్తు చేశారు. నేడు అంతకు మించి అప్పులు చేసి కూడా సంక్షేమం, అభివృద్ధి చేయకుండా కూటమి నాయకులు ఆ సొమ్మును ఏం చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు తెలిపాలని డిమాండ్ చేశారు.

రైతన్నను రోడ్డుపాలు చేయొద్దు

నిర్వాసిత గ్రామాల్లో కంచాలు వాయిస్తూ వినూత్న నిరసన

- రాత్రి సమయంలో అన్నదాతల ఆందోళన
- తక్షణం అదనపు భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్



మూలపర గ్రామంలో కంచాలను వాయిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

నక్కపల్లి: పారిశ్రామికీకరణ పేరిట తమ భూములు లాక్కుంటే రోడ్డున పడతామంటూ నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు బుధవారం రాత్రి రోడ్డెక్కి నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ కోసం అదనపు భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గరిటెలతో కంచాలు వాయిస్తూ వినూత్నంగా ఆందోళన చేశారు. మూలపర, పాటిమీద, చందనాడ, బోయపాడు, రాజయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు, నిర్వాసితులు వైఎస్సార్‌సీపీ, సీపీఎం ఆధ్వర్యంలో రోడ్ల మీదకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, తదితరులు మాట్లాడుతూ ఇప్పటికే కంపెనీలకు భూములు, నివాస ప్రాంతాలు త్యాగం చేసిన రైతులకు సరైన నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లయిన మహిళలు, పురుషులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని గత ఏడాది నుంచి డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించడం తగదన్నారు. ఇప్పటికీ పట్టించుకోకపోతే ఉద్యమం ఉధృతం చేయాలని నిర్ణయించామన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్య పరిష్కరించకుండా బల్క్ డ్రగ్ పార్క్ కోసం అదనంగా మరో 800 ఎకరాలు, స్టీల్‌ప్లాంట్ కోసం మరో 2500 ఎకరాలు సేకరించేందుకు నిర్ణయించారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను అదనపు భూసేకరణను అంగీకరించే ప్రసక్తి లేదన్నారు. హోంమంత్రి అనిత కూడా నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని రైతు నాయకులు ఆరోపించారు. వచ్చే నెల 6న తహసీల్దార్ కార్యాలయంలో జరిగే బల్క్ డ్రగ్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామన్నారు. పార్క్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని గ్రామాల్లోనే ఈ తరహా నిరసనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు, రైతు నాయకులు రావి అప్పారావు, తళ్ల అప్పలస్వామి, తాతారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చందనాడలో కంచాలు వాయిస్తూ నిరసన

మనకు వద్దు బిడ్డో మాయదారి స్మార్ట్ మీటరు..

- సీపీఎం ఇంటింటి ప్రచారం

అనకాపల్లి:

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా అధికారం చేపట్టిన తరువాత గృహాలకు అదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. గతంలో చంద్రబాబు, లోకేష్‌లు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, విద్యుత్ మీటర్లు పగలకొట్టాలని చెప్పి పిలుపునిచ్చారని, నేడు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కొత్తూరు పంచాయతీ ముత్రాస్ కాలనీలో అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటరు వాడటం వలన సెల్‌ఫోన్ మాదిరిగా ముందుగానే డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాల్సి ఉంటుందని, ఇంటికి వచ్చి రీడింగ్ తీసే పద్ధతి ఇక ఉండదన్నారు. ఆన్‌లైన్‌లోనే అదానీ కంపెనీ రీడింగ్ చూస్తుందని, ఆన్‌లైన్‌లోనే బిల్లు పంపుతారని ఆయన పేర్కొన్నారు. ముందుగా చెల్లించిన డబ్బులు అయిపోతుండగా మళ్లీ రీచార్జ్ చేయించుకోవాలని మెసేజ్ మాత్రం పెడతారని, ఆ మెసేజ్ చూసి, సకాలంలో డబ్బులు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా ఆగిపోతుందన్నారు. విద్యుత్ డిమాండ్‌ను బట్టి పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, చలికాలం ఒక రేటు, వేసవికాలం మరొక రేటు, ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచే అవకాశం ఉంటుందన్నారు. నేడు ప్రైవేట్ టెలిఫోన్ కంపెనీలు అడ్డగోలుగా దోచుకుంటున్న మాదిరిగానే రానున్న రోజుల్లో కరెంటు విషయంలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. దేశంలోని వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు బిగించాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించిందని, విద్యుత్ రంగం మొత్తాన్ని ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయాలని రాష్ట్రాలకు ఈమేరకు హుకుం జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సీపీఎం నాయకులు కాళ్ల తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



గృహాలకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించవద్దని పూడిమడక రహదారిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


ఏయూ విద్యార్థుల ఆకలి కేకలు

- పురుగుల అన్నం పెట్టడంతో ఆగ్రహం
- అర్ధరాత్రి.. అర్ధాకలితో రోడ్డెక్కిన స్టూడెంట్స్
- నిరసనతో అట్టుడికిన ఆంధ్ర విశ్వ విద్యాలయం
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



ఏయూ ప్రవేశద్వారం వద్ద రాత్రి పడుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: 'ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం..' అంటూ ఆంధ్రా యూనివర్సిటీ అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా విద్యార్థులు అర్ధాకలితో రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. మంగళవారం రాత్రి సైన్స్ విద్యార్థుల హాస్టల్స్(ఎస్1, ఎస్2) మెస్‌లో వడ్డించిన అన్నం, కూరలో రోకలిబండ, పురుగులు కనిపించడంతో విద్యార్థులు నిరసనకు దిగారు. మూడు రోజుల కిందట చికెన్‌లో కూడా పురుగులు వచ్చాయని వారు ఆరోపించారు. ఇంత అధ్వానంగా భోజనాలు పెట్టడమేమిటంటూ ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఏయూ ముఖద్వారం వద్ద బైఠాయించి ఆందోళన ప్రారంభించారు. అర్ధరాత్రి దాటినా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు.. రాత్రంతా అక్కడే జాగరణ చేసి నిరసన కొనసాగించారు. బుధవారం ఉదయం ఏయూలోని అన్ని వసతి గృహాలకు, తరగతి గదులకు ప్రదర్శనగా వెళ్లి తోటి విద్యార్థుల మద్దతు కూడగట్టుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు భారీ సంఖ్యలో చేరుకుని ఆందోళన కొనసాగించారు. 'ఏయూ అధికారుల నిరంకుశ వైఖరి నశించాలి', 'వీసీ డౌన్ డౌన్', 'పురుగుల అన్నం పెట్టినా పట్టించుకోని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.' అంటూ నినాదాలతో హోరెత్తించారు. వర్సిటీ సైన్స్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.రాజు వారిని సముదాయించే ప్రయత్నం చేసినా విద్యార్థులు శాంతించలేదు. ఉపకులపతి వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే తక్షణమే రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ విద్యార్థుల వద్దకు వచ్చారు. వారితో పాటు నేలపై కూర్చుని సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు.



అన్నం, కూరలో పురుగులు

ఆచార్యుల తీరుపై ఆగ్రహం

వీసీ విద్యార్థులతో చర్చిస్తున్న సమయంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఎస్. రాజు, దూరవిద్యా కేంద్రం మాజీ డైరెక్టర్ ఆచార్య విజయమోహన్, మహిళా వసతిగృహం చీఫ్ వార్డెన్ ఆచార్య పల్లవిల తీరుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ముగ్గురు ఆచార్యులు విద్యార్థులతో వాగ్వాదానికి దిగుతూ.. 'మీరిక్కడికి ఎందుకు **వచ్చారు? మీదే గ్రూప్? మీ ఐడీ** కార్డులు చూపించండి. **వర్సిటీ విద్యార్థులు కాని** వారిని అరెస్టు **చేయండి.' అని అనడంతో విద్యా**ర్థులు ఉవ్వెత్తున **ఎగసిపడ్డారు. 'మీ సిబ్బంది** ఐడీ కార్డులు **ఎక్కడ? వర్సిటీలోకి వ**స్తున్న ఇతరుల **ఐడీ కార్డులు ఎందు**కు అడగడం **లేదు?'అని** విద్యార్థులు ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేయిస్తామని బెదిరిస్తారా? అంటూ ఆ ముగ్గురు ఆచార్యుల వైఖరిపై నిరసన గళం విప్పారు. ఏ ఒక్క విద్యార్థిపైనా కక్షపూరిత చర్యలు తీసుకున్నా మళ్లీ నిరసనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. దీంతో వీసీ కలుగజేసుకుని.. శాంతించాలని విద్యార్థులను కోరారు.



విద్యార్థులకు వార్నింగ్ ఇస్తున్న ప్రొఫెసర్

సమస్యల ఏకరువు

ఐదు నెలల కిందట రోడ్డెక్కి సమస్యలు విన్నవించినా **ఇంతవరకు పరిష్కరించలే**దని ఏయూ **ఎస్ఎఫ్ఐ నాయకుడు వెంకటరమణ** వీసీకి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు.

- మెస్‌లో నాణ్యత లేని, పురుగులతో కూడిన భోజనం పెడుతున్నారు. ఇలా జరగడం ఇది రెండోసారి. మెస్‌లలో పరిశుభ్రత లేదు. నాసిరకం భోజనానికి భారీగా మెస్ బిల్లులు వసూలు చేస్తున్నారు.
- వసతిగృహాల కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలను, విద్యుత్ బిల్లులను మెస్ బిల్లుల్లో కలిపి విద్యార్థులపై మోపుతున్నారు. ఈ భారాన్ని యాజమాన్యమే భరించాలి.
- మహిళా వసతి గృహాల వద్ద రక్షణ లేదు. బయటి వ్యక్తులు ప్రాంగణంలోకి చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రహరీలు నిర్మించి, సెక్యూరిటీని పెంచాలి.
- విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ తరగతులు ప్రారంభం కాలేదు. గెస్ట్ అధ్యాపకుల రెన్యువల్ ప్రక్రియలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నాం.
- ప్రతి వసతి గృహంలో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి, పరిశుభ్రమైన తాగునీరు అందించాలి. కిచెన్, డైనింగ్ హాళ్లను ఆధునికీకరించి, కొత్త మంచాలు, కుర్చీలు సమకూర్చాలి.
- వర్సిటీ సెమినార్ హాళ్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి. డిస్పెన్సరీలో అన్ని మందులు ఉంచి, వైద్య సేవలు విస్తృతం చేయాలి. వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలి. దూరవిద్యా కేంద్రాన్ని బలోపేతం చేయాలి. స్కాలర్‌షిప్‌లు సకాలంలో మంజూరు చేయాలి. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో గ్రంథాలయ సేవలు మెరుగుపరచాలి. హాస్టళ్లలో ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

రెండు వారాల్లో పరిష్కారం.. వీసీ హామీ

విద్యార్థుల సమస్యలను విన్న వీసీ ఆచార్య రాజశేఖర్.. రెండు వారాల్లోగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. నాణ్యమైన ఆహారం అందించేందుకు 'ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేస్తామని, ఈ బృందం హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తుందని తెలిపారు. ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు నియమిస్తామని హామీ ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమస్యల పరిష్కారానికి వీసీ హామీ ఇచ్చినా విద్యార్థులు శాంతించలేదు. ఆందోళన కొనసాగించడంతో ఆచార్య ఎం.వి.ఆర్.రాజు విద్యార్థులతో మాట్లాడారు. 'ఆగస్టు 21లోగా మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం, నమ్మండి.' అని విద్యార్థులను శాంతింపజేశారు. దీంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

కబళిస్తున్న కిడ్నీ మహమ్మారి


భద్రయ్యపేట గ్రామం

15 ఏళ్లుగా మృత్యువుతో పోరాడుతున్నాడు కృష్ణ. అతనికి కాళ్లు విరిగినప్పుడు కాదు.. కిడ్నీలు పాడయ్యాయని తెలిసినప్పుడు జీవిత అగమ్యగోచరంలా మారింది. కేవలం కృష్ణ ఒక్కడే కాదు, అతని తల్లి, తమ్ముడు, భార్య... ఇలా అతని కుటుంబంలో నలుగురు ఇదే మహమ్మారితో యుద్ధం చేస్తున్నారు. ఇది కేవలం కృష్ణ కుటుంబ కథ కాదు. పద్మనాభం మండలం భద్రయ్యపేట అనే చిన్న గ్రామంలోని బాధితుల వ్యథ. ఏడేళ్లలో 20 మందిని బలిగొని, మరో 50 మందిని మంచాన పడేసిన ఈ కిడ్నీ వ్యాధి ఇప్పుడు ఆ ఊరిని నిశ్శబ్దంగా మింగేస్తోంది.

- భద్రయ్యపేటలో ఏడేళ్లలో 20 మంది మృతి
- 138 మందికి పరీక్షలు చేస్తే 50 మందికి వ్యాధి నిర్ధారణ
- ఇందుకు కారణం క్వారీలా? కలుషిత నీరా?


కిడ్నీ వ్యాధి బారిన పడిన వారి వివరాలు సేకరిస్తున్న రేవిడి పీహెచ్‌సీ సిబ్బంది


కిడ్నీ వ్యాధితో మంచాన పడిన తల్లి రాములమ్మ, కొడుకు కృష్ణ

పద్మనాభం: మండలం రెడ్డిపల్లి పంచాయతీలోని భద్రయ్యపేట గ్రామస్తులను కిడ్నీ వ్యాధి తీవ్రంగా పట్టిపీడిస్తోంది. గ్రామంలోని మూడు వందల జనాభాలో ఇప్పటికే 50 మంది ఈ వ్యాధి బారిన పడ్డారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గడిచిన ఏడేళ్లలో సుమారు 20 మంది కిడ్నీ వ్యాధితోనే మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ క్రమంలో తమకు రక్తపరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులకు వినతిపత్రం అందించారు. వారి అభ్యర్థన మేరకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మేలో 138 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 50 మంది రక్తంలో క్రియేటినిన్ స్థాయిలు ఉండాల్సిన దాని కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వారికి కిడ్నీ వ్యాధి సోకినట్లు మూడు రోజుల కిందట పీహెచ్‌సీ సిబ్బంది నిర్ధారించడంతో గ్రామస్తుల్లో ఆందోళన మరింత పెరిగింది. వీరికి మళ్లీ పరీక్షలు జరిపేందుకు మంగళవారం కొంతమందిని, బుధవారం మరికొంతమందిని కేజీహెచ్‌కు తరలించారు.

ఒకే కుటుంబంపై తీవ్ర ప్రభావం

ఈ వ్యాధి ఆల్తి గోపాల్ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఇప్పటికే ఆయన ఇంట్లో బుచ్చిబాబు, సన్యాసమ్మ, అప్పలనరసమ్మ కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఆయనతో కలిపి ఆ ఇంట్లో మొత్తం నలుగురు మరణించారు. గత జూన్‌లోనే అప్పలనరసమ్మ కన్నుమూశారు. మరోవైపు వృద్ధురాలు కొరాడ రాములమ్మతో పాటు ఆమె కుమారులు కృష్ణ (54), శ్రీను (30), కోడలు చినతల్లి (49) కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు.

కారణాలపై అనుమానాలు

గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా శుద్ధి చేసిన నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ఆ నీటిని రాత్రిపూట పట్టి ఉంచితే తెల్లవారేసరికి సున్నం రంగులోకి మారిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలో మూడు క్వారీలు ఉన్నాయి. క్వారీల్లో రాయిని పగలగొట్టడానికి ఉపయోగించే పేలుడు పదార్థాల రసాయనాలు విషతుల్యమై, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

డీఎంహెచ్‌వో పర్యటన


భద్రయ్యపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

డీఎంహెచ్‌వో పి. జగదీశ్వరరావు తన బృందంతో కలిసి బుధవారం భద్రయ్యపేటను సందర్శించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారికి భరోసా కల్పించారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది భద్రయ్యపేటలోనే అందుబాటులో ఉండి వైద్యం అందించాలని ఆదేశించారు. నడుము నొప్పి, నీరసం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆంధ్రా మెడికల్ కళాశాల వైద్యబృందాన్ని గ్రామానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో నీరు కలుషితం కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఎంపీడీవో ఎం.వి జయ్‌కుమార్, గ్రామ కార్యదర్శి నూర్జహాన్, డాక్టర్ బి. ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో నలుగురికీ కిడ్నీ వ్యాధి



మా ఇంట్లో నలుగురం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాం. మా అమ్మ రాములమ్మ, నేను ఈ వ్యాధి కారణంగా మంచానపడ్డాం. నా తమ్ముడు శ్రీను, నా భార్య చినతల్లి కూడా ఇదే వ్యాధితో బాధపడుతున్నారు. 15 ఏళ్ల కిందట నాకు కాళ్లు విరగడంతో ఆపరేషన్ కోసం కేజీహెచ్‌కు వెళ్లాను. అక్కడ చేసిన పరీక్షల్లో నా రెండు కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు చెప్పారు. ఆపరేషన్ చేస్తే ప్రాణహాని ఉంటుందన్నారు. అయినా నా బలవంతం మీద ఆపరేషన్ చేశారు. 15 ఏళ్ల నుంచి కిడ్నీ వ్యాధికి మందులు వాడుతున్నాను. ఇంటి నుంచి బయటకు నడిచి వెళ్లలేని స్థితిలో ఉన్నాను. ఏ పనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాను.

– కె. కృష్ణ, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

నడవడానికి ఇబ్బందిగా ఉంది



నేను కిడ్నీ వ్యాధి బారిన పడటంతో ఏ పనికీ వెళ్లలేకపోతున్నాను. ఇంట్లోనే ఉంటున్నాను. కాసేపు నడిచినా నడుము, ఒళ్లు నొప్పులు, ఆయాసం వస్తున్నాయి. కంటి ఆపరేషన్ చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్తే, కిడ్నీలు బాగాలేవని ఆపరేషన్ చేయకుండానే వెనక్కి పంపించారు. కేజీహెచ్‌కు వెళ్లి కిడ్నీ వ్యాధికి మందులు వాడుకోవాలని సూచించారు. రెండేళ్లుగా మందులు వాడుతున్నాను.

– కె. నరసింహం, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

గ్రామంలో పరీక్షతోనే తెలిసింది



రేవిడి పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో కొందరి నుంచి రక్త నమూనాలు సేకరించారు. నా నుంచి కూడా తీసుకున్నారు. పరీక్షల తర్వాత నాకు కిడ్నీ వ్యాధి ఉన్నట్టు చెప్పారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు వస్తుంది. కానీ రాత్రి పట్టిన నీరు తెల్లారేసరికి సున్నం రంగులోకి మారిపోతోంది. అధికారులు మా తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– కె.బంగారు తల్లి, కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు

శాసన మండలి ప్రతిపక్షనేత బొత్సను కలిసిన పేట నేతలు


బొత్సతో భేటీ అయిన నాయకులు

నక్కపల్లి: శాసన మండలి ప్రతిపక్షనేత, మాజీ మంత్రి బొత్ససత్యనారాయణను పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన సీనియర్‌నాయకులు బుధవారం కలిసారు. ఎస్.రాయవరం ఎంపీపీ బొలిశెట్టి గోవిందు, కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్.రాయవరం జెడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి తదితరులు బొత్ససత్యనారాయణ , పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు తదితరులతో భేటీ అయ్యారు. ఇటీవల ఎస్.రాయవరం ఎంపీపీ బొలిశెట్టి గోవిందు వైఎస్సార్‌సీపీకి రాజీనామా ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయనతో మాట్లాడి సమస్యలు తెలుసుకునేందుకు బొత్స నక్కపల్లి, ఎస్.రాయవరం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలో చోటు చేసుకుంటున్న సంఘటనలు సమస్యలను వీసం, బొలిశెట్టిలు బొత్సకు వివరించారు. త్వరలోనే పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని బొత్స సూచించినట్లు నాయకులు తెలిపారు.

బొత్సను కలిసిన వారిలో ఎస్.రాయవరం మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొణతాల శ్రీను, మధు వర్మ, కోటవురట్ల వైస్ఎంపీపీ దత్తుడు సీతబాబు, సర్పంచ్‌లు సత్యనారాయణ,దూళిశ్రీను,కాసులు, తదితరులు ఉన్నారు.

వరి సాగులో కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు


పెదనందిపల్లిలో యంత్రంతో నాట్లు వేసిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

- అనకాపల్లి చెరకు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం

దేవరాపల్లి: ఖరీఫ్ వరి సాగులో కాలి బాటలు తీయడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని అనకాపల్లి చెరకు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డా. ఆదిలక్ష్మీ, డా. చంద్రశేఖర్, డా. ఉమామహేశ్వరరావు అన్నారు. పెదనందిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యంత్రంతో నాట్లు వేసిన వరి పొలాలను స్థానిక వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి బుధవారం పరిశీలించారు. ఖరీఫ్ వరి సాగులో కాలిబాటలు తీయడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగులుందని, తద్వారా తెగుళ్ల సోకకుండా నివారించవచ్చునని రైతులకు వివరించారు. కాలిబాటలతో కలుపు సమస్యను సకాలంలో గుర్తించడంతో పాటు పంటను సులభంగా పర్యవేక్షణ, తగినంత నీరు, ఎరువులు అందించేందుకు అనువుగా ఉంటుందన్నారు.

వెరసి రైతులకు కలుపు తీసేందుకు కూలీల ఖర్చులు తగ్గి, పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని అవగాహన కల్పించారు. ఖరీఫ్ వరి నాట్లు వేసే రైతులు తప్పనిసరిగా కాలిబాటు తీసుకోవాలని వారు సూచించారు. వరి నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరానికి 50 కేజీల డీఏపీ ఎరువు వేసుకోవడం ద్వారా పంటకు బలం చేకూరుతుందన్నారు. వీరి వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

బోటనీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ(వృక్ష శాస్త్రం) బోధించేందుకు అతిథి అధ్యాపకుని పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తెలిపారు. ఆసక్తి గల, ఎంఎస్సీ బోటనీ సబ్జెక్ట్‌లో 50శాతానికి పైబడి మార్కులు కలిగిన అభ్యర్థులు ఈ పోస్టుకు ఈ నెల 26లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

స్కూల్ బిల్డింగ్ అద్దెకు కావలెను

రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన కాకినాడ ఆదిత్య విద్యాసంస్థల వారి ఆదిత్య స్కూల్ బ్రాంచీలు ప్రారంభించుటకు, ఈ క్రింది ప్రాంతాలలో తగిన వసతులు గల స్కూల్ బిల్డింగ్ ఆటస్థలముతో అద్దెకు కావలెను. సిద్ధంగా వున్న బిల్డింగ్ లేదా ఖాళీ స్థలంలో బిల్డింగ్ కట్టించి అద్దెకు ఇచ్చుటకు ఆసక్తి వున్నవారు సంప్రదించండి.

✦ తుని ✦ అనకాపల్లి

భవనము (సుమారు 20000 నుండి 25000 చ॥అ॥ వైశాల్యం ఉండాలి) ఆటస్థలంతో కలిపి మొత్తం ఒక ఎకరం ఉండాలి.

E-mail: adityaschools@aditya.ac.in

Cell: 9154162537, 9705576667

హతుడి భార్యకు ఆర్థికసాయం


హతుడి భార్య బంగారమ్మకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, కంపెనీ ప్రతినిధులు

తుమ్మపాల: ముత్యాలమ్మపాలెంలో మే 18న హత్యకు గురైన ఎన్టీపీసీ–సింహాద్రి కాంట్రాక్ట్ కార్మికుడు మైలపల్లి బంగారాజు భార్యకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1,20,760 ఆర్థిక సాయాన్ని కలెక్టర్ విజయ కృష్ణన్ అందజేశారు.అచ్యుతాపురానికి చెందిన తోయాత్సో రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ ద్వారా కంపెనీ తరపున సీఎస్ఆర్ నిధుల నుంచి ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తోయాత్సో రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.మురళీధరరావు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి సహకారం అందించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర బిషప్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు బిషప్ మోహన్ కుమార్ కాటన్

దేవరాపల్లి: క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని రాష్ట్ర బిషప్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు బిషప్ మోహన్ కుమార్ కాటన్ కోరారు. స్థానిక కల్వరి రాక్ చర్చిలో ఏపీ బీసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు బంగారి సాల్మన్ రాజు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో మోహన్ కుమార్ కాటన్‌మాట్లాడారు. అనంతరం క్రైస్తవులకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతి పత్రాలను అందజేయాలని నిర్ణయించారు. అనంతరం జిల్లా కౌన్సిల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడిగా యేసురాజు, కార్యదర్శిగా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా బి.యోహాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మోజోస్, డేనియల్, అనంత కుమార్, విజయబాబు, శాంతికుమార్, భాస్కర్ తదితర్లు పాల్గొన్నారు.

మురుగుకాలువలో పసికందు మృతదేహం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: స్థానిక సంతబయలు పంచాయతీ మురుగు కాలువలో అప్పుడే పుట్టిన ఆడ పసికందు మృతదేహం కనిపించడం స్థానికంగా సంచలనం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఒక వ్యక్తి కిరాణా దుకాణం నుంచి కాలువ దాటుతూ కాలువలో ఉన్న పసికందు మృతదేహాన్ని గుర్తించాడు. స్థానికులకు సమాచారం అందజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ అల్లు స్వామినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పసికందును చుట్టితీసుకొచ్చిన వస్త్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏమైనా ఆధారం లభిస్తుందా? అనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. పసికందు మృతదేహాన్ని వెలికి తీయించి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మంగళవారం తెల్లవారుజామున గాని, రాత్రి గాని జన సంచారం లేని సమయంలో పసికందును తెచ్చి కాలువలో పడవేసి ఉండవచ్చని భావిస్తున్నారు. స్థానిక చర్చి వద్ద సీసీ టీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. అయితే దానిపై ఇంకా స్పష్టత రావలసి ఉంది. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ, ఆరోగ్య సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ జరిపారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తొలగింపు

విశాఖలీగల్ : మూడేళ్ల పదవీ కాలం పూర్తయిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగిస్తూ రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్. మూర్తి, మహిళా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్, కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలాపు శకుంతల పదవీ కాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో వారి పోస్టులను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీరి స్థానంలో త్వరలోనే కొత్తవారిని భర్తీ చేస్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కూడు పెడుతున్న భూముల జోలికి రావొద్దు

- తక్షణం భూసేకరణను రద్దు చేయండి
- బుచ్చెయ్యపేటలో 7 గ్రామాల రైతుల నిరసన


బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు


తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: తమకు ఎటువంటి పరిశ్రమలు, కంపెనీలొద్దని, కూడు పెడుతున్న భూముల జోలికి రావొద్దంటూ మండలంలోని ఏడు గ్రామాల రైతులు నిరసనకు దిగారు. బుచ్చెయ్యపేట మండల శివారు గ్రామాలైన పెద మల్లాం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, అప్పన్నపాలెం, చిన భీమవరం, ఎంబీ పాలెం, చిన మల్లాం, తదితర గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణకు వ్యతిరేకంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ముందుగా ఆటోలు, వ్యాన్లపై వందలాది మంది రైతులు బుచ్చెయ్యపేట నాలుగు రోడ్ల జంక్షన్‌కు తరలివచ్చి మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ గ్రామాల్లో భూసేకరణ ప్రతిపాదనలను అధికారులు తక్షణం ఉపసంహరించుకోవాలని సర్పంచ్‌లు, రైతు సంఘ నాయకులు నమ్మి నీరజ అప్పలరాజు, బల్లిన అమ్మునాయుడు, బోయిన నారాయణమూర్తి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రజల సమక్షంలో గ్రామ సభలు, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా అధికారులు గోప్యంగా గ్రామాల్లో సర్వేలు చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలకు పంట భూములను ధారాదత్తం చేసేలా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తమకు కూడు పెడుతున్న భూములను లాక్కొని, అన్యాయం చేయొద్దని రైతులు నినాదాలు చేశారు. ఇక్కడి జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి ర్యాలీగా వెళ్లి అక్కడ కూడా నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అలాగే పలువురు రైతులు చోడవరం వెళ్లి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు కూడా వినతిపత్రం అందించారు. తకు జీవనోపాధిని చూపుతున్న భూములను కంపెనీలకు ఇవ్వకుండా చూడాలని కోరారు.

రగ్బీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణికి సత్కారం


విష్ణు ప్రియను అభినందిస్తున్న కైట్స్ కళాశాల సిబ్బంది

అచ్యుతాపురం రూరల్ : జాతీయ స్థాయి రగ్బీ పోటీలో ప్రతిభ కనబరిచిన కైట్స్ విద్యార్థిని రంగాల విష్ణు ప్రియను కళాశాల కరస్పాండెంట్లు రెడ్డి గణేష్, చిరంజీవి, కోచ్ వెంకట్ బుధవారం దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విష్ణు ప్రియ మరిన్ని విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

కొమరాడ వసతిగృహ భవనం పరిశీలన


వసతిగృహంలో పెచ్చులూడుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సాంబశివరావు

కె.కోటపాడు : కొరువాడ బీసీ బాలుర వసతిగృహన్ని మండల స్థాయి అధికారులు బుధవారం పరిశీలించారు. వసతిగృహంలో వరండాతో పాటు విద్యార్థులు పడుకునే గదుల్లో శ్లాబ్ నుంచి పెచ్చులురాలిపడుతున్న ప్రాంతాన్ని ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవోలు సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్ పరిశీలించారు. భవనానికి మరామ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా తెలపనున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతా యాపారమే..

ఆధ్యాత్మికత ముసుగులో వసూళ్లు

- ప్రవేశాల నుంచి చెప్పులు స్టాండ్ వరకు రుసుములే..
- దుకాణాల అద్దెలతో వ్యాపారం
- హోర్డింగ్ కోసం రూ.లక్షల చెల్లించాల్సిందే..
- బీచ్ రోడ్‌లోని రామాలయం సెట్‌పై విమర్శలు వెల్లువ
- తాజాగా కల్యాణం పేరుతో రూ.2,999 వసూలు



ఏయూక్యాంపస్ : దేవుడిని దర్శించుకోవాలంటే టికెట్ కొనాలి. చెప్పులు పెట్టడానికి టికెట్ కొనాలి. దాహం వేసి మంచినీళ్ల కావాలంటే అక్కటే పెట్టిన దుకాణాలలో కొనుగోలు చేయాలి. ఇలా అడుగడుగునా ఆధ్యాత్మికత పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గరుడ అయోధ్య రామ మందిరం నమూన చుట్టూ ఆర్థిక లావాదేవీలే కనిపిస్తున్నాయి. గత రెండు నెలలుగా బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక వ్యాపారం వెనుక ఉన్న అనేక అంశాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి.

దేవుడి పేరుతో దండుకొంటున్నారు

దేవుడి పేరు చెప్పి గత రెండు నెలలుగా కోట్లాది రూపాయలు దండుకున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక్కడి పరిస్థితులు సైతం దీనికి అద్దం పడుతున్నాయి. అయోధ్య రామ మందిరం నమూనాను రెండు నెలల క్రితం బీచ్‌రోడ్డులోని ఒక ప్రైవేటు విల్లాకు సంబంధించిన స్థలంలో నిర్మించారు. ప్రవేశ రుసుముగా రూ.50, చెప్పులు భద్రపరచడానికి రూ.5 చొప్పున వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో వెయ్యి నుంచి నాలుగు వేల మంది, శని, ఆది వారాలలో 5 నుంచి 10 వేల మంది దీనిని దర్శించుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో గత రెండు నెలల కాలంలో నిర్వాహకులు భారీగానే సంపాదించారని స్థానికులు చెబుతున్నారు. వీరు పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభాలను పొందారనే విషయం స్పష్టం అవుతోంది. అదే విధంగా ఇక్కడ సందర్శకులకు కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వడం లేదు. అక్కడే ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొనుక్కోవాల్సిందే.

రాముని కల్యాణంతో బయటకు పొక్కింది

ఆయోధ్య రాముని కల్యాణోత్సవాలు పేరుతో గత కొన్ని రోజులుగా నగరంలో పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ఈ నెల 29న నిర్వహించే కల్యాణంలో భద్రాచలం ఆస్థాన పండితులు పాల్గొంటారని పేర్కొన్నారు. రూ.2,999 ధర గల కల్యాణం టికెట్ల కోసం తమను సంప్రదించాలని కోరుతూ ఫోన్ నంబర్లను సైతం ప్రకటించారు. రాముని కల్యాణాన్ని సైతం ఒక వ్యాపార కార్యక్రమంగా మార్చేశారు. దీనిపై భద్రాచలం ఆలయ అధికారులు విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇక్కడ అనధికారికంగా జరుగుతున్న తంతు బయటకు వచ్చింది. నిర్వాహకులు మాత్రం తాము భద్రాచలం ఆస్థాన పండితులు వస్తారని చెప్పలేదని, భద్రాచలం నుంచి పండితులు వస్తారని మాత్రమే చెప్పామని వివరణ ఇచ్చేసి చేతులు దులిపేసుకున్నారు.

బాధితులు బయటకు వస్తున్నారు


గణేష్

అయోధ్య రామ మందిరం సెట్ వేసిన నిర్వాహకుడు దుర్గాప్రసాద్ చేతిలో నష్టపోయిన కాకినాడకు చెందిన దుర్గ గణేష్ తాజాగా ఒక వీడియో విడుదల చేశాడు. అయోధ్య రామ మందిరం సెట్ పేరుతో రూ.32 లక్షలు ఖర్చుచేయించి, డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపించారు. కూరగాయల వ్యాపారం చేసే తనను నమ్మించి కుంభమేళాలో రామ మందిరం సెట్ వేస్తున్నానని, దానిలో పెట్టుబడిగా రూ.30 లక్షలు ఇస్తే రూ.50 లక్షలు ఇస్తానని నమ్మించి మోసం చేశాడని వీడియోలో ఆరోపించాడు. ఇప్పటికే తాను కాకినాడ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, VEERU NAIDU M/o. Service No. 16113291 F, Rank : HAV, Moturu Ramakrishna, Residing at H.No. 15-158, Dharmavaram, Yellamanchili, Visakhapatnam Dist, Present Anakapalli Dist - 531055, A.P. Now changed my name & DOB from VEERU NAIDU (Old Name) to MOTURU VEERABHADRA RAO (New Name). DOB : 01.07.1960 to 01.01.1954 Henceforth I will be called as MOTURU VEERABHADRA RAO (New Name) for all purpose vide Affidavit date of 23.07.2025

Real Estate

FLAT FOR SALE
అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK ఫ్లాట్ 52 లక్షలకే అమ్మకం. ఫోన్ : 98663 21992 [V-14154]

Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

OLD AGE HOME
Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90103 92178 [SCA25006392]

Wanted

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవక, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275594]

డైరెక్ట్ జాయినింగ్ మాకంపెనీ లందు కాలేజీ లందు సూపర్ వైజర్స్ స్టోర్ ఇంచార్జి డ్రైవర్లు EX-ఆర్మీకా. (రూమ్, భో) PF, ESIజీ. 18-32K సె.8341821079. [SCA25006472]

దొండపర్తి శ్రీకన్య థియేటర్ ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (12 Hours Duty) 14000/-, కావలెను. Age 50 below,Spot Joining ✆ 97034 65118 [B-184]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

క్లుప్తంగా

27న రక్తదాన శిబిరం

అనకాపల్లి: మిత్ర అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈనెల 27న సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధి సత్యం మాస్టర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని విశాఖ ఎ.ఎస్.రాజా వలంటరీ బ్లడ్‌బ్యాంకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఏడాది రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తప్పిన అగ్ని ప్రమాదం



ఎన్టీఆర్ బెల్లంమార్కెట్ దుకాణాల వద్ద వ్యాపించిన మంటలు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు దుకాణాల వద్ద గల చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం నిప్పుపెట్టారు. మంటలు ఒక్కసారిగా ఎగసిపడడంతో మార్నింగ్ వాక్ చేస్తున్నవారు గుర్తించి, నాలుగు బైక్‌లు, రెండు కార్లను పక్కకు లాగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: స్థానిక విద్యుత్‌శాఖ డి–1,2 సెక్షన్ల పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతు పనుల నిమిత్తం ఈనెల 25వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ(ఆపరేషన్)కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ జాతీయ రహదారి ఫీడర్ పరిధిలో సంతబయలు నుంచి నూకాంబిక ఆర్చ్ రహదారి, గ్రీన్‌హిల్స్ ఏరియా, రవిరేస్ పెట్రోల్ బంకు ఏరియా, గౌరీకాలనీ, 11కేవీ పూల్‌బాగ్ ఫీడర్ పరిధిలో వన్‌వేడౌన్ ఏరియా, కస్పావీధి, బండిగాడివీధి, ఎన్టీఆర్ ఆస్పత్రి ఏరియా, పెరుగు బజార్ జంక్షన్, పూల్‌బాగ్‌రోడ్డు, రఘురామ్ కాలనీ, చింతావారి వీధి, 11కేవీ పట్టణ–1 ఫీడర్ పరిధిలో గుండాల జంక్షన్, ఆర్‌ఈఆర్‌ఎస్ కార్యాలయ రహదారి ఏరియా, మిరియాల కాలనీ, సాయినగర్, విజయరామరాజుపేట ఫీడర్ పరిధిలో అంజయ్యకాలనీ, విద్యుత్‌నగర్, ఎన్‌కాంట్యాక్స్ ఏరియా, ఎంఎంసీ కాలనీ, గాంధీనగర్, లక్ష్మీనారాయణనగర్, గొల్లవీధి, పిళ్లావారివీధి, యర్రవారి వీధి ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కెప్టెన్ లక్ష్మి సెహగల్‌కు ఘన నివాళి

కశింకోట: కెప్టెన్ లక్ష్మి సెహగల్ వర్ధంతి కార్యక్రమాన్ని ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధులు ఎ. సత్యవతి, అచ్చియ్యమ్మ, డి. నాగమణి, నూకాలమ్మ, పూర్ణ, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 25 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,600	3,600
మూడోరకం	2,800	3,200

అనకాపల్లి సినిమాలు

రాజా	:హరిహర వీరమల్లు
సత్యనారాయణ స్క్రీన్-1	: జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	: హరిహర వీరమల్లు
పర్తిసాయి	: హరిహర వీరమల్లు
షిర్డీసాయి	: హరిహర వీరమల్లు
వెంకటేశ్వర	: హరిహర వీరమల్లు
శ్రీ సత్య	: తమ్ముడు
రామచంద్ర	: హరిహర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్–16, బి పాజిటివ్–9, ఒ పాజిటివ్–23 , ఏబీ పాజిటివ్–2 యూనిట్ల శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(ఫోన్ నంబర్.9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్.08924–223595)ని సంప్రదించవచ్చు.

ఎస్సీ కాలనీలో దాహం కేకలు



గెడ్డ కాలువలో ఉన్న మంచినీటి కుళాయి



తాగునీటికి బిందెలతో నిరసన తెలుపుతున్న బంగారయ్యపేట ఎస్సీ కాలనీ వాసులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట ఎస్సీ కాలనీలో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. పది రోజుల నుంచి తాగునీరు సరఫరా నిలిచిపోయింది. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు సరిగా స్పందించలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ఎత్తులో ఉండడంతో సరిగా నీటి సరఫరా జరగడం లేదు. ఈ కాలనీలో సుమారు 50 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వారందరికీ ఒకే మంచినీటి కుళాయి ఉంది. దీనికి స్థానిక రక్షిత మంచినీటి పథకం నుంచి కనెక్షన్ ఇచ్చారు. ఇది గెడ్డ కాలువలో ఉండటం వల్ల వర్షం పడితే కాలనీవాసులు అష్టకష్టాలు పడి బురద నీటిలో తాగునీరు పట్టుకోవలసి వస్తోంది. కుళాయి నుంచి ఒక్కొక్కసారి కలుషిత నీరు వస్తోంది. గత్యంతరం లేక ఆ నీటినే తాగుతున్నారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిండినప్పుడు బయటకు వచ్చే వృథా నీరు దిగువకు ప్రవహించే మార్గం లేక నిలిచిపోయి మళ్లీ బోరులోకి ఇంకుతోంది. దీంతో బోరులో నీరు కలుషితమవుతోందని, అది కుళాయిల ద్వారా సరఫరా అవుతోందని కాలనీ వాసులు తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. పలు మార్లు ఆందోళన చేసినా స్పందించలేదని తెలిపారు.

కుళాయి కనెక్షనులు ఇచ్చినా...

నెల రోజుల కిందట ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. వాటి ద్వారా ఇంకా నీటి సరఫరా ప్రారంభించలేదు. ఉన్న ఒక్క కుళాయి నుంచి గత పది రోజులుగా నీరు రాలేదు. దీంతో నీటి కోసం కష్టాలు ఎదుర్కోవలసి వస్తోందని స్థానికులు వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కుళాయిలకు నీటిని సరఫరా చేయాలని కోరారు. దీంతో బుధవారం మరో కుళాయి ఏర్పాటుకు పనులు చేపట్టారు. అయితే దానితోపాటు ఇంటింటి కుళాయిలకు ఎప్పుడు నీరు సరఫరా చేస్తారో తెలియని పరిస్థితి.



బోరు ప్రాంతంలో నిల్వ ఉండిపోతున్న నీరు

పది రోజులుగా ఇబ్బందులు



ఎస్సీ కాలనీలో పది రోజులుగా కుళాయి నుంచి నీరు సరఫరా కాక ఇబ్బంది పడుతున్నాం. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి నీరు సరఫరా చేయడం లేదు. దీంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పూర్తి స్థాయిలో తాగునీటిని అందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నాగమణి, బంగారయ్యపేట ఎస్సీ కాలనీ.

వర్షం పడితే నరకయాతనే...



గెడ్డ కాలువలో ఉన్న కుళాయి నుంచి నీటిని పట్టుకోవలసి వస్తోంది. వర్షం పడితే కాలువలో వరద నీరు చేరుతోంది. దీంతో కుళాయినీరు పట్టుకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. కాలనీ ఎత్తు ప్రాంతంలో ఉండటం వల్ల కుళాయికి సరిగా నీరు రావడం లేదు. దీనివల్ల ఇంటింటి కుళాయిలకు కూడా నీరు సరఫరా అయ్యే అవకాశం లేదు. దీనిదృష్ట్యా భూగర్భంలో సమ మట్టంగా పైపు లైన్ ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలి.

–పెట్ల పూర్ణాదేవి, బంగారయ్యపేట ఎస్సీ కాలనీ

కలుషితనీరు తాగుతున్నాం



రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ నుంచి వచ్చే వృథా నీరు పోవడానికి మార్గం ఏర్పాటు చేయాలి. లేదంటే బోరులోకి ఆ నీరు ఇంకి పోయి కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఆ నీరు తాగి వ్యాధులు బారిన పడుతున్నాం.

–కావేరి, బంగారయ్యపేట ఎస్సీ కాలనీ.

మానవ అక్రమ రవాణా కట్టడికి సమష్టి కృషి

యలమంచిలి రూరల్: ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మానవ అక్రమ రవాణా సమస్యను అరికట్టడానికి సమాజంలో అన్ని వర్గాల వారు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ నెల 30వ తేదీ ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, మహిళల అక్రమ రవాణా పట్ల సమాజంలో అన్ని వర్గాల వారు జాగ్రత్తగా ఉండాలని బాలల హక్కుల సమితి జిల్లా ప్రతినిధి డి.లోవరాజు కోరారు. ప్రజలంతా ఐక్యంగా ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవాలన్నారు. పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమం యలమంచిలి రైల్వేస్టేషన్, బస్ కాంప్లెక్స్‌ల వద్ద బ్యానర్లు ప్రదర్శించి అవగాహన కల్పించారు. యలమంచిలి రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లలో అనుమానం వచ్చిన 18ఏళ్లలోపు మైనర్లను తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో సీడ్ సంస్థ చైర్మన్ కేవీ చిన్నారావు, కమ్యూనిటీ సామాజిక కార్యకర్త అమ్మాజీ, కనకమహాలక్ష్మి, ఎస్ఐ కె.నవీన్, కానిస్టేబుల్ జె.అశోక్ పాల్గొన్నారు.



యలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వరాహనదిలో పూడిక తీత

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం నుంచి లింగరాజుపాలెం వెళ్లే వరాహనది బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న పూడికను తొలగిస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ అమినా భాను బుధవారం తెలిపారు. సుమారు 30 ఏళ్ల ఈ బ్రిడ్జి సమీపంలో నదీ గర్భం పూడుకుపోవడంతో వరద నీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహించి, సమీపంలో ఉన్న భూములు కోతకు గురయ్యేవని చెప్పారు. బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కూడా ఏర్పడదన్నారు. ఈ మేరకు మండల పరిషత్ నిధులు రూ.4.5 లక్షలతో ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు సహకారంతో పూడిక తీత పనులు చేపడుతున్నామన్నారు. బ్రిడ్జి ఖానాలు శుభ్రం చేసి, గట్టు పటిష్టం చేయడం ద్వారా నదీ ప్రవాహం సజావుగా సాగుతాదని చెప్పారు. అయితే ఈ పనులు శాశ్వతం కాదని, పెద్ద మొత్తంలో నిధులు వస్తే నది గట్టుకు రాతి పేర్పు చేపట్టాలన్నారు.

పల్లెకు శ్రావణశోభ

- రేపటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- పూజలకు ముస్తాబవుతున్న ఆలయాలు
- నోములు, వ్రతాలకు సిద్ధమవుతున్న మహిళలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పండ్లు

అనకాపల్లి: శ్రావణమాసం వచ్చిందంటే చాలు కొత్తకోడళ్ల నోములు...మహిళల వ్రతాలు...ముత్తయిదువులు..వాయినాలు ఇలా నెలంతా తెలుగు లోగిళ్లు సందడిగా కనిపిస్తాయి. ప్రతి మహిళ శ్రావణలక్ష్మిని ఆహ్వానిస్తూ ఇంటిలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 24వ తేదీ వరకూ శ్రావణ మాస పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రతి ఇల్లు ఓ ఆలయంగా మారి ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతుంది. శ్రావణమాస పూజలకు నియోజకవర్గంలో అన్ని గ్రామాల ప్రజలు ఇప్పటికే సన్నద్ధమయ్యారు. అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

ఆలయాల్లో ...

శ్రావణమాసంలో పట్టణంలో గవరపాలెం నూకాంబిక ఆలయంతో పాటు మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయం, గవరపాలెం కనక దుర్గాదేవి, గవరపాలెం కామాక్షి దేవి, సత్యనారాయణపురంలో కొండపై గల కనక దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవార్లకు విశేషంగా అలంకరించి, నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ జరపనున్నారు. ఇందుకోసం ఇప్పటికే పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆయా ఆలయాల అధికారులు, సిబ్బంది, నిర్వాహకులు చర్యలు చేపట్టారు.



గవరపాలెం నూకాంబిక అమ్మవారు

మార్కెట్‌కు లక్ష్మీకళ

వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు చేసేందుకు అవసరమైన సామగ్రిని ఇప్పటి నుంచి మహిళలు కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు కిటకిటలాడుతున్నాయి. అలాగే అమ్మవారి వ్రతాల సందర్భంగా కొందరు ఇళ్లను ప్రత్యేక అలంకరించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అలంకరణ సామగ్రికి గిరాకీ పెరిగింది. ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలకు, పూజ సందర్భంగా ఇళ్లలో అలంకరించేందుకు పూల దండల తయారీకి పూల షాపులకు, ముత్తయిదువులకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు కేటరింగ్ వారికి పలువురు ఆర్డర్లు ఇస్తున్నారు. పూజల ఫొటోలు, వీడియోలను తీయించేందుకు ఏర్పాట్లు చేస్తుండడంతో ఫొటో, వీడియోగ్రాఫర్లకు, చేతి నిండా పనిలభిస్తోంది. అనకాపల్లి పట్టణంలో శ్రావణమాసంలో గత ఏడాది సుమారు రూ.30 లక్షల వరకూ పూలు, రూ.40 లక్షల వరకు పండ్లు, బంగారం రూ. రెండు కోట్లు, వస్త్ర వ్యాపారం రూ.కోటి వరకూ జరిగిందని వ్యాపారులు తెలిపారు.

శ్రావణమాసం..పండగ పర్వదినాలు..

శ్రావణమాసంలో వచ్చే మూడో శుక్రవారం (ఆగస్టు 8) వరలక్ష్మీవ్రతం, 9న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



కశింకోటలో కనకమహాలక్ష్మి అమ్మవారు



నెహ్రూచౌక్‌లో పూల దుకాణం

అలాగే శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 25, ఆగస్టు 1, 8, 15, 23) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

25 నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 25 నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు అర్చకుడు వెలవలపల్లి శివ తెలిపారు. శ్రావణ మాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో కూడా శ్రావణ మాసం శుక్రవారాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వి. చిదంబరం తెలిపారు.

హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి

అనకాపల్లి టౌన్: జిల్లాలోని హాస్టళ్లలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. స్థానికంగా నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఇటీవల హాస్టళ్లు, కళాశాలలను పరిశీలించినట్టు తెలిపారు. నర్సీపట్నం మండలం శివపురం గ్రామం ఎస్టీ–3 బాలికల హాస్టల్‌లో సుమారు 300 మంది విద్యార్థినులుండగా ఒక్క బాత్‌రూమ్ మాత్రమే ఉందని, జిల్లా కేంద్రం అనకాపల్లిలో గల బీసీ బాలికల హాస్టల్‌లో 200 మంది విద్యార్థినులకు నాలుగు రూములే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి. విజయ్, దివాకర్, వెంకటలక్ష్మి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి 84వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లపు గోవింద తండ్రి ఎల్లపు చంద్రరావు ఇటీవల అనారోగ్యకారణంతో మృతిచెందారు. గోవింద్‌తో పాటు కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామ రాజు, 80,84వ వార్డు ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ,రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బోడ్డేడ శివ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లపు గోవింద, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భరత్‌కుమార్

ఆర్టీఐ అర్జీలకు సకాలంలో సమాచారం అందించాలి

అనకాపల్లి: ఆర్టీఐ అర్జీలకు సకాలంలో సమాచారం అందించే బాధ్యత అధికారులతో పాటు సిబ్బందిపై ఉందని ఆర్టీఐ చట్టం రిసోర్స్ జిల్లా సభ్యుడు, ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహా కమిటీ (ఈఆర్‌సీ ఎస్ఏసీ) సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. తుమ్మపాలలోని ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం జిల్లా అధికారి కార్యాలయంలో బుధవారం ఆర్టీఐ చట్టంపై ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఐ చట్టం అమలుపట్ల బాధ్యతతో అధికారులు వ్యవహరించాలన్నారు. చట్టంలోని వివిధ సెక్షన్లు, దరఖాస్తులను ఎలా స్వీకరించాలి, సమాచారాన్ని ఎలా సేకరించాలి, సమయపాలన, అప్పీళ్లు, మినహాయింపులు, జరిమానాలు, న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ల తీర్పులు తదితర అంశాలపై తెలియజేశారు. ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం జిల్లా అధికారి జి.వి.లక్ష్మి అధ్యక్షతన ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

కరెంట్ కట్ .. ఉక్కపోతతో ఇక్కట్లు

కశింకోట: మండలకేంద్రం కశింకోటలో మంగళవారం రాత్రి సుమారు రెండున్నర గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలముకుంది. ఒక్కపక్క ఉక్కపోత, మరో పక్క దోమల మోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి 10 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇక్కడికి బయ్యవరం, కొత్తూరు వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల నుంచి చెరో భాగం విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే కొత్తూరు సబ్ స్టేషన్‌లో నింబ్ కాలిపోవడంతో ఇక్కడి ఒక ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దానికి కూడా విద్యుత్ సరఫరాను బయ్యవరం సబ్ స్టేషన్ నుంచి పునరుద్ధరించడంతో లోడ్ ఎక్కువై సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రత్యామ్నాయంగా నరసింగబిల్లి సబ్ స్టేషన్ లైన్లకు అనుసంధానించి విద్యుత్ సరఫరాను రెండు ప్రాంతాలకు వేర్వేరుగా పునరుద్ధరించారు. బుధవారం సాయంత్రం కూడా విద్యుత్ సరఫరాలో పలుసార్లు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బంది చెందారు. విద్యుత్ వినియోగం ఎక్కువ కావడం వల్ల, కొత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో నింబ్ కాలిపోవడం వల్ల సరఫరాకు అంతరాయం కలుగుతోందని, దీన్ని నివారించడానికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక విద్యుత్ ఏఈ ప్రసాద్ తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్



కశింకోటలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



అడ్డాంలో దోమల నివారణకు పొగ పెడుతున్న సిబ్బంది

కశింకోట: మండలంలో కశింకోట, అడ్డాంలలో దోమల నివారణకు బుధవారం ఫాగింగ్ చేశారు. కశింకోటలో పంచాయతీ కార్యదర్శి ఎస్. రామచంద్రరావు, అడ్డాంలో కార్యదర్శి గంటి అభిషేక్ ఫాగింగ్‌ను పర్యవేక్షించారు.

క్వారీని రద్దు చేయాలంటూ నిరాహారదీక్ష

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడురు నల్లరాయి క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సాగుదారులైన దళితులు, ప్రజా సంఘాలు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టాయి. ఈ ధర్నాకు బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టా నాగరాజు, జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్ల చంటి, సీపీఎం నాయకులు చిరంజీవి, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీకి అనుమతులు ఇవ్వడం వల్ల దళిత సామాజిక వర్గాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. క్వారీ వల్ల గాలి, నీటి కాలుష్యం పెరిగి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. క్వారీ పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడతాయన్నారు. స్థానికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్వారీని వెంటనే రద్దు చేయాలన్నారు. దాని వల్ల కలిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో క్వారీలకు అనుమతులు ఇచ్చే ముందు స్థానికుల అభిప్రాయం తీసుకోవాలన్నారు. క్వారీ అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ నిరాహారదీక్షలో అప్పారావు, గణేష్, లక్ష్మి, లవరాజు పాల్గొన్నారు.

చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా రామకృష్ణ

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా వై.రామకృష్ణ నియమితులయ్యారు. ఉద్యోగుల బదిలీల్లో భాగంగా చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేసిన ఎస్తేర్ రాణిని ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో విశాఖ కేజీహెచ్ నుంచి రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవ లందించేందుకు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి :

9010973030, 9010546644, 9951602901

Office mail : sakshiadvtvsp@gmail.com